
# ధర్మం

-చంపక్



ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

ఒక కుల సంఘం తన సంఘ సభ్యుడు, టీచర్ కృపానందంగారిని హెడ్మాస్టర్ సుబ్రహ్మణ్యం కులం పేరుతో దూషించాడని కోర్టులో కేసు వేసినట్టు వచ్చిన వార్త చదివి జిల్లాలోని ఉపాధ్యాయులు ముక్కున వేలేసుకున్నారు.

నిబంధనల ప్రకారం ముక్కుకు సూటిగా పోతాడని, మంచి ఫలితాలకోసం తను శ్రమిస్తూ తనకింద పనిచేసే ఉపాధ్యాయుల్ని నిద్రపోనివ్వడని సుబ్రహ్మణ్యానికి పేరు.

ఆయన కులం పేరుతో దూషించే వ్యక్తి కాదని కొందరు భావించగా, వాడికి భలే శాస్తి అయిందని సంతోషించిన వాళ్ళూ వున్నారు.

స్కూలుకి ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చి హడావుడిగా క్లాసుకి వెళ్తున్న కృపానందంని వరండా మీదనే ఆపి పది నిమిషాలు చివాట్లు పెట్టి కులం పేరుతో దూషించాడని, విద్యార్థులూ టీచర్ల ఎదుట అవమానించాడని సుబ్రహ్మణ్యం మీద అభియోగం.

కృపానందం ఐదు నిమిషాలు కాదు, ఏకంగా ఏభై ఐదు నిమిషాలు ఆలస్యంగా స్కూలుకొచ్చాడు. హాజరు పట్టీలో అతని పేరు ఎదురుగా ఎర్ర గీతతో లేట్ మార్క్ వేసినా, ఆ గీత కనిపించకుండా దాని మీదనే సంతకం పెట్టి వెంటనే క్లాసుకి వెళ్ళకుండా టీచర్స్ రూంలో కబుర్లు చెబుతూ కూర్చున్నందుకు మందలించానని, ఇందులో కుల ప్రసక్తి, కులం పేరుతో దూషణ లేవని సుబ్రహ్మణ్యం సంజాయిషీ.

"న్యాయం కోసం, న్యాయం కోసం మాత్రమే" అన్న ఆదర్శంతో పనిచేస్తున్న చైతన్య విక్రమం అనే సంస్థలో చైతన్య లాయర్ అయితే విక్రమ్ డిటెక్టివ్. వాళ్ళిద్దరూ కలిసి ఎన్నో కేసుల్లో విజయం సాధించారు.

సుబ్రహ్మణ్యం తరపున చైతన్య, కుల సంఘం తరపున ప్రఖ్యాత లాయర్ గురునాథ్ కోర్టులో వాద ప్రతివాదాలు చేపట్టారు.

సుబ్రహ్మణ్యం తరపున ఆయన మతానికే చెందిన ముగ్గురు మాస్టార్లు, కృపానందం తరపున ఆయన కులానికే చెందిన నలుగురు మాస్టార్లు సాక్ష్యం చెప్పారు గాని వాళ్ళు కుల మతాలకు అతీతంగా సాక్ష్యం చెప్పలేకపోయారని లాయర్లిద్దరూ వాదించారు. కోర్టు విచారణ వారాల తరబడి కొనసాగడంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి వాళ్ళూ కోర్టుకు రావడం తమ సాక్ష్యం కూడా వినమని న్యాయమూర్తిని కోరడం జరిగింది.

అయితే మైనారిటీ దాటని పిల్లలు చెప్పేది సాక్ష్యంగా పనికిరాదని గురునాథ్ వాదించగా ఎవరి ప్రోద్బలం లేకుండా స్వతఃసిద్ధంగా ప్రశ్నల్ని అర్థంచేసుకుని జవాబు చెప్పగల పిల్లల సాక్ష్యం పరిగణించవచ్చని సుప్రీం కోర్టు యిచ్చిన తీర్పుని ప్రస్తావించాడు చైతన్య.

పెద్దల సాక్ష్యంతో విషయం తేలకపోతే పిన్నల సాక్ష్యం పరిగణించవచ్చని రూలింగ్ యిచ్చాడు న్యాయమూర్తి.

సుబ్రహ్మణ్యం మత దురహంకారి. నుదుట బొట్టు, చెవిలో పువ్వు పెట్టుకుంటాడు. ఆయన మత తత్వానికి అంతకంటే సాక్ష్యం ఏం కావాలి? తరతరాలుగా ఆయన కులంవారు నిమ్న జాతుల్ని అణగదొక్కుతూనే ఉన్నారు. అవమానిస్తూనే ఉన్నారు. అవకాశాలూ, ఉద్యోగాలూ రాకుండా అడ్డుకుంటూనే ఉన్నారు. రాజ్యాంగం ప్రకారం వీళ్ళు ఉద్యోగాలు చేస్తోంటే వాళ్ళకి కడుపుమంట. కుళ్ళు. వాళ్ళు అధికారులుగా ఉన్నచోట వీళ్ళు పనిచేయలేని పరిస్థితి నెలకొంటున్నది. ఈ అహంకారాన్ని శిక్షించకపోతే సామాజిక అశాంతి రాజుకొని దేశం విచ్ఛిన్నం అవుతుంది అని బల్లగుద్ది చెప్పాడు గురునాథ్.

ప్రతి వ్యక్తి తన మత భావాల్ని స్వేచ్ఛగా పాటించే హక్కు భారత రాజ్యాంగం ప్రసాదించింది. మన దేశంలో ఇతర మతాలవారు తమ మత చిహ్నాల్ని స్వేచ్ఛగా ధరిస్తారు. ఎవరూ ఆక్షేపించరు. కాని హిందువుల దౌర్భాగ్యం ఏమంటే మగవారు బొట్టు పెట్టుకుంటే హిందువులే ఎగతాళి చేస్తారు. చెవిలో పువ్వు పెట్టుకుంటే జోక్ చేస్తారు. మోసాన్ని చెవిలో పువ్వు పెట్టడంగా అభివర్ణిస్తారు. బొట్టు, పువ్వు ఉన్న వాడిని మత దురహంకారిగా గేలి చేయడం సెక్యులర్ వాదులకు ఫ్యాషన్‌గా మారింది.

"కానీ, యువరానర్! బొట్టు, పువ్వు చూసి సుబ్రహ్మణ్యంగారిని, ఆమాటకొస్తే ఎవరినైనా సరే, మత దురహంకారిగా భావించతగదు. అలా అనవలసి వస్తే కృపానందంగారి మెడలో మత చిహ్నం ఉంది. ఆయన్ని కూడా మత దురహంకారి అనాలి. అందుకాయన ఒప్పుకుంటారా?" సూటిగా ప్రశ్నించాడు చైతన్య.

ఇబ్బందిగా ముఖం పెట్టాడు కృపానందం.

"యువరానర్! దురహంకారులు అన్ని మతాల్లోనూ ఉంటారు. అలాని మత విశ్వాసులందర్నీ దురహంకారులు అనలేం. సుబ్రహ్మణ్యంగారు పదిహేనేళ్ళు టీచర్‌గా పనిచేసి ఐదేళ్ళుగా హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్నారు. సర్వీసులో చేరినప్పటి నుంచి ఆయన బొట్టు పువ్వు ధరిస్తూనే ఉన్నారు. అయినా ఇంతవరకూ ఆయన సర్వీసులో ఒక్క అభియోగమూ లేదు. రెండేళ్ళ క్రితం ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందారు కూడా."

చైతన్య చెప్పగానే గురునాథ్ అడ్డు తగిలాడు. "ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వాళ్ళంతా ఉత్తమ మానవులు కానక్కరలేదు యువరానర్! ఈమధ్యనే మనం దినపత్రికల్లో చూశాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలచే ఉత్తమ పోలీసుగా ప్రశంసా పత్రాలు అందుకున్న ఒక ఇన్‌స్పెక్టర్‌ని ఎసిబి వల పన్ని పట్టుకుందని! బొట్టు, పువ్వు చూసి ఆయన మతానికే చెందిన అధికారులు ప్రభావితులై అవార్డు యిచ్చి ఉంటారు. ఆయనపై అభియోగాలు నమోదుకాకపోవడానికీ అధికారులే కారణం కావచ్చు."

అక్కడ చేరిన పిల్లలు "నో, నో" అని అరిచి బల్లలు గుద్ది నిరసన తెలియజేశారు.

"ఆర్డర్! ఆర్డర్!" సుత్తి మోగింది. బోనులోకి వచ్చి ప్రమాణం చేసి చెప్పమని పిల్లల్ని ఆదేశించాడు న్యాయమూర్తి.

పిల్లలు ఒక్కొక్కరూ వచ్చి- సుబ్రహ్మణ్యం మాస్టారు చాలా మంచివారు. బాగా పాఠాలు చెబుతారు. మత బోధ చేయరు. కృపానందం మాస్టారే సరిగా క్లాసులకు రారు. వస్తే మత బోధలు చేస్తారు- అని చెబుతూ తమ నోట్ బుక్కులు చూపించి ఆయన ఏయే తేదీల్లో క్లాసులకు రాలేదో ఎప్పుడెప్పుడు వచ్చారో- చెప్పారు.

దాంతో ఖంగుతిన్న లాయర్ గురునాథ్ "యువరానర్! మైనారిటీ తీరని పిల్లలు ఏదో చెబితే దాన్ని మనం సాక్ష్యంగా తీసుకోజాలం. వాళ్ళందర్నీ నిందితుడే తీసుకొచ్చాడు కాబోలు. వాళ్ళదీ అతనిదీ ఒకే కులం కావచ్చు" అభ్యంతరం చెప్పాడు.

"కుల మత వైషమ్యాలు పెద్దలకే గాని పిల్లలకుండవు యువరానర్! ఈ పిల్లల్లో మూడు మూడు మతాలకు చెందిన పది కులాల వారున్నారు. అందరూ స్కూలులో లీవ్ లెటర్ యిచ్చి మరీ వచ్చారు. గురుభక్తితో గురువుగారికి అన్యాయం జరగకూడదన్న ఆకాంక్షతో ఎవరి

ప్రోద్బలం లేకుండా వచ్చారు. అందుకు మనం వారిని అభినందించాలి. వాళ్ళు అబద్ధం చెబుతున్నారనిపిస్తే క్రాస్ ఎగ్జామిన్ చేసి నిజం రాబట్టే హక్కు నా ప్రియ మిత్రుడు గురునాథ్‌గారికి ఉన్నది కదా యువరానర్" అన్నాడు చైతన్య.

గురునాథ్ ముఖం గంభీరంగా మారిపోయింది. "యువరానర్! వీళ్ళంతా నిందితుడు తీసుకొచ్చిన పిల్లలు. పదిహేను మంది వున్నారు. జాగ్రత్తగా కులాల వారీగా, మతాల వారీగా ఎంపిక చేసి, ట్రెయినింగ్ యిచ్చి తీసుకొచ్చినట్టున్నారు. కావాలంటే నా క్లయింట్ కూడా రేపు పాతిక మందిని తీసుకురాగలడు."

"మతాల వారీగా, కులాల వారీగా ఎంపిక చేసి బాగా ట్రెయినింగ్ యిచ్చి..." అని కాసేపాగి "తీసుకొస్తారా? ఒకరోజు సరిపోతుందా?" అమాయకంగా ముఖంపెట్టి అడిగాడు చైతన్య.

ప్రేక్షకులంతా ఘొల్లున నవ్వేశారు.

"దిసీజ్ టూమచ్, యువరానర్!" ఉక్రోషం ధ్వనించింది గురునాథ్ స్వరంలో.

"సారీ, మైడియర్ ఫ్రెండ్! మీరు నా క్లయింట్ గురించి అన్న మాటలే నేను మీ క్లయింట్ గురించి అన్నాను. బాగా ట్రెయినింగ్ పొంది అబద్ధాలు చెప్పే సాక్షిని కూడా క్రాస్ ఎగ్జామినేషన్‌లో బురిడీ కొట్టించి నిజం చెప్పించే చాతుర్యం లాయర్‌కుండాలి. ఆ పిల్లల్ని బురిడీ కొట్టించి నిజం రప్పించండి" చిద్విలాసంగా అన్నాడు చైతన్య.

గురునాథ్ అసహనంగా చూశాడు.

"సరే, అదలా ఉంచండి. ఆ పదిహేను మంది, మీ పాతిక మందితో సరిపెట్టడం ఎందుకు? స్కూలులోని మొత్తం విద్యార్థులందరి ఓట్లు తీసుకొని న్యాయ నిర్ణయం చేద్దామన్నా మేము సిద్ధమే. అప్పుడూ మేమే గెలుస్తాం" ధీమాగా అన్నాడు చైతన్య.

అలా చేస్తే ఓటమి తప్పదని కాబోలు "యువరానర్! సాక్షుల ఓటింగ్ ద్వారా తీర్పు చెప్పడం ఏ కోర్టులోనూ ఎప్పుడూ, ఎక్కడా జరగలేదు. అది అభిలషణీయం కాదు కూడా. ఆ పిల్లల సాక్ష్యాన్ని పరిగణించకుండా పెద్దల సాక్ష్యాన్నిబట్టి తీరు చెప్పవలసినదిగా కోరుతున్నాను" వేడుకున్నాడు గురునాథ్.

"అందుకు మా అభ్యంతరం లేదు యువరానర్! కానీ మా తరఫున మరో సాక్షిని ప్రవేశపెట్టడానికి అనుమతి కోరుతున్నాను. ఇప్పుడు సమయం చాలదు కనుక రేపు ప్రవేశపెడతాం" వేడుకున్నాడు చైతన్య- ఓరకంట గురునాథ్‌ని చూస్తూ.

ఆ అభ్యర్థనను వ్యతిరేకించాలా, వద్దా అని గురునాథ్ ఆలోచిస్తూనే అనుమానంగా అడిగాడు "ఎవరా సాక్షి?"

"మీకు తెలిసినవారే. ఈ జిల్లాలో పనిచేసి ప్రక్క జిల్లాకు బదిలీఅయిన ఒక విద్యాధికారి జీవరత్నంగారు."

గురునాథ్ సాలోచనగా కృపానందం వైపు చూశాడు. ఆయన ఆలోచిస్తున్నాడు. జీవరత్నంగారు తమ కులం వాడే. అందువల్ల తనకు న్యాయం జరుగుతుందన్న భరోసా కలిగింది.

* * *

కోర్టులో చైతన్య అడిగిన ప్రశ్నలకు జవాబుగా కొత్త సాక్షి రాజరత్నం యిచ్చిన సమాధానాలు-

అతడు కృపానందం కులానికి చెందినవాడే. ఒకప్పుడిదే జిల్లాలో పనిచేయడంవల్ల అతనికి సుబ్రహ్మణ్యం, కృపానందం- ఇద్దరూ తెలుసు. ఇది ప్రయివేటు కేసు. తను ప్రయివేటు సాక్షి కనుక అధికార పత్రాల్ని, అధికార రహస్యాల్ని వెల్లడించలేడు. కోర్టువారు విద్యాశాఖను ఆదేశిస్తే తప్పక అధికార పత్రాలు అందుబాటులోకి వస్తాయి. ఈ ఇద్దరు ఉపాధ్యాయుల పనితనాన్ని పర్యవేక్షించిన అధికారిగా తనకు తెలిసిన నిజాలు చెప్పాడు.

"నేనిక్కడొక విషయం స్పష్టం చేయదలచుకున్నాను. అనేక వందల సంవత్సరాలుగా మన దేశంలో కొన్ని కులాలు అణగదొక్కబడ్డాయి. అవమానించబడ్డాయి. దిక్కుతోచక కొందరు మతం మారారు. కొత్త మతంలోనూ వారు బావుకున్నదేమీ లేదు. అక్కడా అదే వివక్ష. అదే అవమానం.

"అయితే ప్రభుత్వం ఈ కులాల వారికి కొన్ని వెసులుబాటులు కల్పించడం వల్లనే నేను ప్రస్తుత పదవిలోకి రాగలిగాను. లేకుంటే గొడ్లచావిడిలో ఉండే వాడిని. ఒకప్పుడు అణచి వేయబడిన కులాలలోని కొందరిప్పుడు ఉన్నత పదవుల్లో ఉన్నారు. వారి సామాజిక స్థితిగతులు పూర్వం కన్నా మెరుగుపడిన మాట సత్యమే.



"అయితే విచారించవలసిన ఒక కొత్త సమస్య ఈమధ్య కాలంలో తల ఎత్తుతోంది ప్రభుత్వం కల్పించిన రక్షణను దుర్వినియోగం చేస్తూ కొందరు ప్రబుద్ధులు అగ్రవర్ణాల అధికారులపై విరుచుకుపడడం, కక్ష సాధింపునకు పూనుకోవడం, అసత్య ఆరోపణలతో కోర్టుకెక్కి మీడియా ప్రచారం పొందడం తరుచుగా జరుగుతోంది. అలాగే అగ్ర వర్ణాలవారు కూడా మా కులం అధికారుల మీద తిరగబడడం కూడా జరుగుతోంది. ఈ పరిస్థితిని సకాలంలో నివారించకపోతే భవిష్యత్తులో ఏ ఆఫీసులోనూ పనులు జరగవు.

"నిజానికి కృపానందంగారి మీద ఎన్నో ఆరోపణలున్నాయి, యువరానర్! అందుకే ఆయన ఏ ఊళ్ళోనూ రెండేళ్ళు మించి పనిచేయలేకపోయారు."

ఆ ప్రశ్నోత్తర ధోరణి చూసి జీవరత్నం మనోడు అవునా కాదా అని సంశయంలో పడ్డ గురునాథ్ ఠక్కున అభ్యంతరం చెప్పాడు "యువరానర్! ఈ సాక్షి ప్రస్తుత కేసుకి సంబంధం లేని విషయాలు చెబుతున్నాడు. ఎక్కడో, ఏదో జరిగితే ఈ కేసుతో సంబంధం ఏమిటి?"

"ఎక్కడో, ఏదో జరగడం కాదు యువరానర్! కృపానందంగారి వ్యక్తిత్వానికి సంబంధించిన విషయం" అభ్యంతరం తోసిపుచ్చాడు చైతన్య.

"ఆయన మత ప్రచారం చేసేవారు" చెప్పాడు జీవరత్నం.

"ఖాళీ సమయాల్లో మత ప్రచారం చేసుకోవడం రాజ్యాంగం ప్రసాదించిన హక్కు."

"కానీ - తమ మత గ్రంథాల్ని చదివినా, తమ ప్రార్థనాలయాల్లోకి వచ్చినా పరీక్షల్లో ఎక్కువ మార్కులు వేస్తారని ప్రలోభ పెట్టడం నేరమే. క్లాసుల్లో మత గ్రంథాలు పంచిపెట్టడమూ నేరమే. ఆ నేరానికి గాను అతడొకసారి సస్పెండ్ అయ్యాడు కూడా. పదో క్లాసు పబ్లిక్ పరీక్షలో తన కులంవారికి కాపీలు అందిస్తూ పట్టుబడి డ్యూటీ నుంచి తొలగించబడ్డాడు ఒకసారి."

"యువరానర్! ఈ సాక్షి అధికార రహస్యాలు వెల్లడిస్తున్నాడు" అభ్యంతరం చెప్పాడు గురునాథ్.

"ఇందులో రహస్యం ఏమీలేదు యువరానర్! ఈ విషయాలు విద్యార్థులకు తెలుసు. తల్లిదండ్రులకు తెలుసు. మీడియా ద్వారా ప్రజలందరికీ తెలుసు."

గురునాథ్ యింక మాట్లాడలేదు.

"ఒక స్కూలు గురించి గాని, అందులో పనిచేసే ఉపాధ్యాయుల సత్తా గురించి గాని తెలుసుకోవాలంటే నిపుణులూ, నివేదికలూ అక్కర లేదు యువరానర్! ఆ స్కూలు పిల్లలతో కలిసిపోయి వారితో ఆడుతూ, పాడుతూ తెలుసుకోవచ్చు. నిజానికి ఒక ఉపాధ్యాయుని గురించి అంచనా వేయాలంటే విద్యార్థులే సరియైన న్యాయమూర్తులు!" జీవరత్నం అనగానే కోర్టులో ఉన్న పిల్లలంతా హుషారుగా "అవును! అవును!" అని అరిచారు.

"ఆర్డర్! ఆర్డర్!" సుత్తి మోగింది.

"ఆ స్కూలులో చదివే మా బంధువుల పిల్లలు సెలవుల్లో మా యింటికొస్తూ ఉంటారు. వాళ్ళ ద్వారా నేను సేకరించిన విషయాలు కూడా సుబ్రహ్మణ్యం మత దురహంకారి కాదనే చెబుతాయి" తన సాక్ష్యాన్ని ముగించాడు జీవరత్నం.

న్యాయమూర్తి కేసు కొట్టేశాడు.

జివ్వున ఎగసిన కన్నీటిని తుడుచుకొని పైకి చూస్తూ భగవంతునికి నమస్కరించి, ఆ తర్వాత జీవరత్నంకి నమస్కరించాడు. సుబ్రహ్మణ్యం, కృతజ్ఞతగా.

"అయ్యో, మీకంటే చిన్న వాడిని. మీరు నాకు నమస్కరించకూడదు" వినమ్రంగా అన్నాడు జీవరత్నం.

"మన సమాజంలో పెచ్చుపెరుగుతున్న కాలుష్యం ఎప్పుడెవర్ని ఎలా కాటు వేస్తుందో చెప్పలేం బాబూ! నేనివాళ కేసునుంచి బయటపడ్డానంటే అది నీ సౌజన్యంవల్లనే. కులాభిమాన కాలుష్యాన్ని తొలగించుకొని నా తరపున సాక్ష్యం చెప్పిన నీలోని దైవత్వానికి నమస్కరిస్తున్నాను బాబూ!" సుబ్రహ్మణ్యం స్వరం గద్గదం అయింది.

"ప్రతీ కులంలోనూ, ప్రతీ మతంలోనూ కృపానందం లాంటి దురహంకారులూ ఉంటారు. జీవరత్నం లాంటి సౌజన్యమూర్తులూ ఉంటారు. సమాజ వినాశనానికి కారణం చెడ్డవాళ్ళు చెలరేగిపోవడం కాదు, మంచివాళ్ళు ఉదాసీనంగా ఉండిపోవడమే. జీవరత్నంగారు ఉదాసీనంగా ఉండిపోకుండా మేము అడగగానే సాక్ష్యం చెప్పడానికొచ్చారు. అది చాలా గొప్ప విషయం" అన్నాడు చైతన్య.

జీవరత్నం మరింత వినమ్రం అయ్యాడు. "నన్నంతగా పొగడకండి. డిప్యూటీ కలక్టర్‌గా పనిచేస్తున్న మా బాబాయి మీద ఐదేళ్ళ క్రితం ఆయనకింద పనిచేసే అగ్రవర్ణాలవారు కక్షతో కేసు పెడితే అగ్రవర్ణానికే చెందిన మీరు మా బాబాయి తరఫున వాదించి గెలిపించారు. ఆ కృతజ్ఞతతోనే నేనిప్పుడు సాక్షిగా వచ్చాను. ఐదేళ్ళ క్రితం ధర్మాన్ని మీరు రక్షించారు. ఇప్పుడు ఆ ధర్మమే మిమ్మల్ని రక్షించింది. అంతే".

★